సాక్షి
తిరుపతి

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



## వ్యాసాశ్రమంలో..

ఏర్పేడులోని వ్యాసాశ్రమంలో అఖండ గురుపూజోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. - IIలో



## తెప్పలపై తేజోమూర్తి

గోవిందరాజస్వామి తెప్పోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లు తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. - IIలో



## శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

ఐఐటీ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. - IIలో

## న్యూస్‌రీల్

### రోజుకు రూ.272 అందాలి



గడ్డపార వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

**రేణిగుంట:** ఉపాధి కూలీలకు రోజుకు రూ.272 కూలి అందేలా పనులు చేయించాలని కలెక్టర్ డాక్టర్ జీ.లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. గురువారం సూరప్పకశంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కూలీలతో కలిసి గడ్డపార వేసి మట్టి తవ్వారు.

### పదో తరగతి విద్యార్థులకు ఉచిత ప్రయాణం

**తిరుపతి అర్బన్:** పబ్లిక్ పరీక్షలు జరిగే రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ఆర్టీసీ సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని ఉత్తర్వులు వచ్చినట్టు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తిరుపతిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు వారి నివాస స్థలం నుంచి పరీక్షా కేంద్రం వరకు మాత్రమే ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు ఉందన్నారు. పల్లె వెలుగుతోపాటు అల్ట్రా పల్లెవెలుగు సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు.

### అంటువ్యాధుల నిర్మూలనపై శిక్షణ




మాట్లాడుతున్న ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్

**చంద్రగిరి:** స్థానిక మోడల్ రూరల్ హెల్త్ రీసెర్చ్ యూనిట్ (ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ)లో అంటువ్యాధులు, స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుపతిలోని శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ (నర్సింగ్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ. చంద్రశేఖరన్ పాల్గొన్నారు. ఈ శిక్షణలో భాగంగా మధుమేహం, అధిక రక్తపోటు, నోరు, ఊపిరితిత్తులు, రొమ్ము, గర్భాశయ వంటి వాటికి వచ్చే క్యాన్సర్ల గురించి విద్యార్థులకు తెలియజేశారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్. వేంకటేశ్వరు, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.సునీత, శ్రీవేంకటేశ్వర వైద్యకళాశాల, శ్రీపద్మావతమ్మ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ అధ్యాపక బృందం, ఎంఆర్‌హెచ్‌ఆర్‌యూ సిబ్బంది పాల్గొన్నారు.



# సాగు భళా






- మాది ఏర్పేడు మండలం, అంజిమేడు గ్రామం. నా పేరు కే.భాస్కర్‌రెడ్డి. వ్యవసాయ సీజన్‌వస్తే సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడులకు అప్పుల కోసం వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సి ఉండేది. అయితే ప్రభుత్వం వచ్చాక ఏటా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రూ.13,500 చెల్లిస్తోంది. విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. మా ఇంటి వద్దకే వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. రైతుకు ఇంతకన్నా ఏం కావాలి.

- నా పేరు లూథియారాణి. మాది సూళ్లూరుపేట. గత ఏడాది గ్రీన్‌టెక్ ఫుడ్ ప్రొడక్ట్ యూనిట్ నాకు మంజూరు చేశారు. రూ.15 లక్షల యూనిట్‌ను అందించారు. అందులో రూ.5.25 లక్షలు రాయితీ వచ్చింది. మా కుటుంబానికి అదే ఆధారం. ప్రభుత్వం నిరుద్యోగులకు ఎంతో అండగా నిలుస్తోంది. నాతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పిస్తోంది. ఎంతో సంతోషంగా ఉంది.



- వ్యవసాయం దండగ కాదు పండగని నిరూపించిన సీఎం వైఎస్ జగన్
- జిల్లాలో 1,80,654 మంది రైతులకు రూ.706.07కోట్ల రైతుభరోసా
- 445 ఆర్బీకేలతో 4 లక్షల మందికి సేవలు
- ఉద్యాన రైతులు, మత్స్యకారులకు అండగా ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతాంగం

**తిరుపతి అర్బన్:** వ్యవసాయం దండగ కాదు పండగని నిరూపించారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతాంగానికి అగ్రతాంబూలం వేశారు. విత్తు నుంచి విక్రయం వరకు అన్నదాతకు అండగా ఉంటూ భరోసానిచ్చారు. గత ఐదేళ్లలో వినూత్నంగా ఆర్బీకేలు, రైతు భరోసా పెట్టుబడి నిధులు, సున్నావడ్డీ రుణాలు, ఉచిత పంటల బీమా, వైఎస్ఆర్ యంత్ర సేవా ద్వారా 32 రకాల పనిముట్లు అందించి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఉద్యాన పంటల విస్తరణకు చర్యలు చేపట్టారు. సూక్ష్మ నీటి పథకం ద్వారా సబ్సిడీపై పరికరాలు, పట్టుపరిశ్రమ అభివృద్ధి, గోదాముల ఏర్పాటు, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ అభివృద్ధికి చర్యలు, మత్స్యభరోసా, ఫిష్ ఆంధ్ర తదితర పథకాల ద్వారా రైతుల బతుకులను సమూలంగా మార్చేశారు.

**వైఎస్సార్ సున్నా వడ్డీ**

సున్నావడ్డీ ద్వారా రైతులకు లక్ష రూపాయల రుణం ప్రభుత్వం మంజూరు చేస్తోంది. సక్రమంగా రుణాలు చెల్లించిన 72,410 మంది రైతులకు రూ.14 కోట్లు వడ్డీ రాయితీ కల్పించింది.

**పంట రుణాలు**

రైతులకు సీజన్‌ల వారీగా క్రాప్ రుణాలు బ్యాంకుల ద్వారా పెద్దమొత్తంలో ఇప్పిస్తున్నారు. 2020–23 కాలంలో ఖరీఫ్ సీజన్‌లో 3,01,520 మంది రైతులకు రూ.4.988 కోట్లు, రబీలో 52,132 మందికి రూ.1,234 కోట్ల రుణాలు ఇప్పించారు.

### వైఎస్సార్ యంత్రసేవా పథకం

రైతులు సేద్యం చేసుకోవడానికి ట్రాక్టర్లు, పలు రకాల పనిముట్లతో పాటు, పంట ఒబ్బిళ్లకు వరికోత యంత్రాలను 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు. దీంతో పాటు 50 శాతం బ్యాంక్ రుణం ఇప్పిస్తున్నారు. రైతులు 10 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ముందుగా 472 కస్టమర్ హైరింగ్ సెంటర్లతో రైతు గ్రూపులుగా చేర్చిన తర్వాత వారికి సహాయం చేస్తున్నారు.



శ్రీకాళహస్తిలో సబ్సిడీ వరికోత యంత్రాలు(ఫైల్)

### రైతు భరోసా



రైతులు పంట పెట్టుబడి కింద అధిక వడ్డీలకు అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. ముందస్తు పెట్టుబడి నిధికింద వైఎస్సార్ రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ.13,500 చొప్పున రైతులకు అందజేస్తున్నారు. 2019 నుంచి 2024 వరకు 1,80,654 మందికి రూ.706.07 కోట్లు అందించారు.

### సూక్ష్మ నీటి సాగు పథకం



2023–24 కాలంలో 5వేల ఎకరాలలో రూ.15 కోట్ల వ్యయంతో బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు రైతులకు 55 శాతం సబ్సిడీతో అందించారు. 2020 నుంచి ప్రతి ఏటా 4వేల నుంచి 5వేల ఎకరాలలో బిందు సేద్యం పరికరాలను రైతులకు రాయితీతో అందిస్తున్నారు.

**ఉద్యాన పంటలు**

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి సమగ్ర ఉద్యాన అభివృద్ధి మిషన్ ద్వారా ఏడాదికి రూ.6.43 కోట్ల ఆర్థిక లక్ష్యంతో 133 హెక్టార్లలో పంటల విస్తరణ, 210 హెక్టార్లలో కొత్తరకాల పూల తోటలు, 53 హెక్టార్లలో హైబ్రిడ్ కూరగాయల విస్తరణ, 102 హెక్టార్లలో ప్లాస్టిక్ మల్చింగ్ పథకం, 0.36 హెక్టార్లలో పాలీ హౌజ్‌లు, షెట్‌నెట్ హౌజ్‌లలో కూరగాయలు, పూల సాగులు చేపట్టారు. 47 హెక్టార్లలో ఆయిల్ పామ్‌తోటలు విస్తరించారు.

### పశుసంవర్ధక శాఖ

పాడీ రైతుకు అండగా నిలవడానికి వైఎస్సార్ సంచార పశువైద్యశాల పేరుతో 14 వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులు తమ పశువులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు. ఇంటిముంగిటకే వచ్చి వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆర్బీకేల ద్వారా 152 పశువైద్యశాలలు పర్యవేక్షణ చేస్తూ వైద్యసేవలందిస్తున్నారు. గడచిన 4 ఏళ్లలో 10.66 లక్షల గొర్రెలు, మేకల నట్టల నివారణ, 5.29 లక్షల పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు, పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు, 60 శాతం సబ్సిడీతో 423 మెట్రిక్ టన్నుల దాణా, 75శాతం సబ్సిడీతో 249 మెట్రిక్ టన్నుల గడ్డి విత్తనాలు రైతులకు అందించారు.



వైఎస్సార్ సంచార వాహనం ద్వారా పశువైద్యం

### అన్నదాతకు అండగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు



తిరుపతి జిల్లాలో 445 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 4 లక్షల మందికిపైగా రైతులకు సేవలందుతున్నాయి. ప్రధానంగా రాయితీతో నాణ్యమైన విత్తనాల పంపిణీ, ఎరువులు, క్రిమిసంహారక మందులు, ధాన్యం కొనుగోలు, పంటలపై అవగాహన, అవసరమైన సమాచారం అందించడం లాంటివి చేస్తున్నారు. ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువుల పంపిణీ కోసం రూ.13,53 కోట్ల రాయితీ కల్పించారు. డిజిటల్ కియోస్క్ ద్వారా పలు వస్తువులు సరఫరా, నిపుణులైన శాస్త్రవేత్తలతో పంటలపై అవగాహన కల్పిస్తున్నారు.

### మార్కెటింగ్ శాఖ



తిరుచానూరు మార్కెట్ యార్డ్

జిల్లాలో 12 వ్యవసాయ మార్కెట్ కమిటీలు రెండు మార్కెట్ యార్డ్‌లలో వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలు సాగుతున్నాయి. పుత్తూరు, తిరుచానూరు రైతు బజారులలో వంద మందికి పైగా రైతులు తాము సాగుచేసిన పంటలను విక్రయించుకునే సౌకర్యం కల్పించారు. 2022–23లో రూ.37 కోట్లు మార్కెట్ రుసుం కింద ప్రభుత్వానికి ఆదాయం చేకూరింది. ఇప్పటికే 34 గోదాములు ఉండగా అదనంగా మరో 30 గోదాములను మంజూరు చేశారు. ఒక్కో యూనిట్‌కు రూ.40 లక్షల చొప్పున మంజూరు చేసి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములు నిర్మిస్తున్నారు.

### వైఎస్సార్ ఉచిత పంటల బీమా



ఉచిత పంటల బీమా ద్వారా పంటకు ప్రమాదం జరిగినప్పుడు రైతుకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా రైతులు కట్టాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో 33,295 మంది రైతులకు రూ.23.04 కోట్లు జమ చేసింది.

### వైఎస్సార్ మత్స్యకార భరోసా

వేట నిషేధకాలంలో గత ప్రభుత్వం ఇస్తున్న రూ.4వేల భృతిని వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.10 వేలకు పెంచారు. 2023–24లో 3,669 మందికి రూ.3.66 కోట్లు మంజూరు చేశారు. వైఎస్సార్ మత్స్యకార పెన్షన్ కానుక పథకం ద్వారా 1,603 కుటుంబాలకు రూ.3 వేల చొప్పున ప్రతి నెలా అందిస్తున్నారు. సముద్ర వేట సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచారు. జిల్లాలో మూడు ప్రభుత్వ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాల ద్వారా 63 లక్షల చేపపిల్లలను పెంచుతున్నారు. మరో వైపు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాజా చేపలు అందించడానికి ఫిష్ ఆంధ్రా పేరుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ ఔత్సాహికులకు 60శాతం, బీసీలకు 40శాతం సబ్సిడీతో ఫిష్ ఆంధ్రా విక్రయ కేంద్రాలకు రుణాలు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 80 యూనిట్లు మంజూరు చేశారు.



### పట్టు పరిశ్రమ

జిల్లాలో మల్బరీ సాగును విస్తరించడానికి ఈ ఏడాది 2,343 ఎకరాలలో సాగుచేస్తూ పట్టు పరిశ్రమపై 950 రైతులకు జీవనోపాధి కల్పించారు. మరో 500 ఎకరాలలో మల్బరీ సాగుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఎకరం మల్బరీ ప్లాంటేషన్‌కు రూ.18,750 సబ్సిడీ అందిస్తున్నారు. పట్టుపురుగుల గది నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేస్తున్నారు.



### ఎన్నో ప్రయోజనాలు



రైతులకు ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో సాయం చేయలేదు. పది మంది రైతులను కస్టమర్ హైరింగ్ సెంటర్ పేరుతో జిల్లాలో 472 గ్రూపులను ఏర్పాటు చేశారు. శ్రీవినాయక రైతు గ్రూపు ద్వారా ట్రాక్టర్ పొందాం. రైతు గ్రూపులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలు, 32 రకాల వివిధ రకాల పనిముట్లు అందజేశారు. **– లక్ష్మీనారాయణ, రైతు, దేవులపల్లి, దక్కిలి మండలం**

### నాణ్యమైన ఎరువులు



మాది శ్రీ పోలమ్మ రైతు మిత్ర గ్రూపు. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన ఎరువులను అందించారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వ హయాంలోనే సేద్యం చేయడం సులభంగా మారింది. బీడు భూములు సైతం సాగులోకి వస్తున్నాయి. **– ఎస్.వెంకటప్రసాద్, రైతు, చిన్నసింగమాల, తొట్టంబేడు మండలం**

# గ్రామస్వరాజ్య వారధులు వలంటీర్లు

- ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న సైనికులు
- రాష్ట్రం గర్వపడేలా పేరు ప్రతిష్టలు తెచ్చిన వలంటీర్ వ్యవస్థ
- టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- వలంటీర్లకు పురస్కారాలు అందజేత





వలంటీర్లకు వజ్ర అవార్డులను అందజేసి సత్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, హాజరైన వలంటీర్లు

**తిరుపతి సిటీ :** గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యామే లక్ష్యంగా జగనన్న పరిపాలన కొనసాగుతోందని, అందుకు వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో గురువారం తిరుపతి నియోజకవర్గ వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న చేపట్టిన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల చెంతకే ప్రభుత్వాన్ని తీసుకొచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల మంది వలంటీర్లను, 1.5 లక్షల మంది సచివాలయ సిబ్బందిని నియమించి ప్రజలకు సంక్షేమ పథకాలను గడప వద్దకే చేర్చుతున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం గర్వపడేలా పేరు ప్రతిష్టలు తీసుకువచ్చింది వలంటీర్లేనని తెలిపారు. జగనన్న మరో మారు సీఎం కాబోతున్నారంటే అందులో ప్రధాన ప్రాత వలంటీర్లదే నన్నారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, ప్రజల నాలుకల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వివరించారు. మరో మారు జగనన్న సీఎం కాకపోతే వలంటీర్ల వ్యవస్థనే తొలగించి ప్రజలకు అందించే పథకాలకు చరమగీతం పాడుతామని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే ప్రకటించినట్టు గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ కరోనా కాలంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు రాష్ట్రంలో కనుచూపు మేరలో కనిపించలేదన్నారు. వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవ చేశారని కొనియాడారు, జగనన్న చేసి అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లి మళ్లీ ప్రజల ప్రభుత్వాన్ని నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు.

**1,908 మంది వలంటీర్లకు ఘన సత్కారం**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సేవా మిత్ర అవార్డు పేరిట 1,885 మంది వలంటీర్లకు రూ.15 వేల చొప్పున రూ.2,87,55,000లు, 18 మందికి సేవారత్న అవార్డు పేరిట రూ.30 వేల చొప్పున రూ.5,40,000లు, ఐదుగురికి సేవా వజ్ర అవార్డు కింద రూ.40 వేల చొప్పున రూ.2,25,000 అందజేశారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారని, వారికి వందనమని పేర్కొన్నారు. కమిషనర్ అతిథి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, దొడ్డారెడ్డి ప్రవల్లికారెడ్డి, కోటూరు ఆంజనేయులు, ఆదం రాధాక్రిష్ణారెడ్డి, దూది కుమారి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, సూపరింటెండెంట్లు రవి, సురేంద్రరావు, మేనేజర్ చిట్టిబాబు, శశి, సాహుల్ పాల్గొన్నారు.

### ఇది నా పూర్వజన్మ సుకృతం



ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ సేవ చేస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారు. మా సేవలను గుర్తించి నందుకు సంతోషంగా ఉంది. ప్రజాసేవలో తరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా.
– జీ.సునితకుమారి, వజ్ర అవార్డు గ్రహీత, ఎస్వీనగర్

### సీఎంకు ధన్యవాదాలు



ప్రజాసేవ దైవ సేవతో సమానం. ఆ అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు. వార్డు వలంటీర్‌గా అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించే సమయంలో కలిగే అనుభూతి వర్ణనాతీతం. వారి ముఖంలో కలిగే సంతోషం చెప్పలేనిది. నవరత్నాలతో చాలా సంతోషంగా ఉన్నారు. మళ్లీ సీఎంగా జగనన్నకే పట్టం కడతారు. – బి.సరిత, వజ్ర అవార్డు గ్రహీత, ఎల్‌బీ నగర్, 21వ డివిజన్, తిరుపతి

### అవార్డులతో సత్కరించడం గర్వంగా ఉంది



వలంటీర్ల సేవను గుర్తించి నగదు బహుమతితో పాటు అవార్డులు అందజేసి సత్కరించడం గర్వంగా ఉంది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం, ప్రభుత్వ పథకాలను పార్టీలకతీతంగా అర్హులందరికీ అందిస్తున్నాం. ఎక్కడా పక్షపాతం చూపడం లేదు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్న వస్తాడని నమ్మకం ఉంది. – కే.లావణ్య, అవార్డు గ్రహీత, బైరాగపట్టెడ, తిరుపతి

### డీజీలాకర్ల ఏర్పాటు



డీజీ లాకర్లు ప్రారంభిస్తున్న అధికారులు

**తిరుపతి తుడా:** తిరుపతి సరోజినీదేవి రోడ్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం డీజీ లాకర్లు ఏర్పాటు చేశారు. డిజిటల్ ఇండియాలో భాగంగా వీటిని దేశంలో మొదటి సారి ప్రయోగాత్మకంగా తిరుపతి సమగ్ర శిక్షా కమ్యూనిటీ మొబలైజ్ అధికారి సురేష్ తిరుపతిలోని ప్రైమరీ స్కూల్‌లో గురువారం ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు తమ సర్టిఫికెట్లు, మార్క్‌లిస్ట్, ఐడీ కార్డ్స్, ముఖ్యమైన పత్రాలు భద్రపరుచుకోవడానికి ఉపయోగపడతాయి. డీజీలాకర్ అనే ప్రత్యేక ఆన్‌లైన్ ఆధారిత సేవను దేశ పౌరుల సౌకర్యార్థం భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఇందులో కీలక పత్రాలన్నింటినీ ఆన్‌లైన్లో భద్రపరుచుకోవచ్చన్నారు. ఎంసీపీ స్కూల్ హెడ్ మాస్టర్ బీ.శారదావేణి, ఉపాధ్యాయులు వాసవి, చక్రధర్, సూర్యకుమారి, సీఆర్‌పీలు ఆషా, షాలిని, వేణు, నవీన్ పాల్గొన్నారు.

## అభ్యర్థుల నియామకం

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ గూడూరు, శ్రీకాళహస్తి నియోజకవర్గాలకు పార్టీ అభ్యర్థులను నియమించింది. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరు నియోజకవర్గ అభ్యర్థిగా ఆనం జయకుమార్ రెడ్డిని, శ్రీకాళహస్తి నియోజకవర్గానికి కె. శంకర్ రెడ్డిని నియమిస్తున్నట్టు పేర్కొంది.

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,191 మంది స్వామివారిని దర్శించుకోగా, 22,295 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.



# కదిలిరండి..ఊరంతా కలిసి రండి..


ఆహ్వాన పత్రికలను ఇస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం, మేయర్ శిరీష


స్వయంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరణాకరరెడ్డి

- ఘనంగా మన తిరుపతి పుట్టిన రోజు పండగను జరుపుకుందాం
- 24వ తేదీ పవిత్ర శోభాయాత్ర
- ఆహ్వానించిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం : ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ, దేశంలోనే ఏ నగరానికీలేని పుట్టిన రోజు వేడుక జరుపుకునే అవకాశం, అదృష్టం మన తిరుపతికే దక్కిందని, ఈ వేడుకలకు నగరంలోని ప్రతి ఒక్కరూ తరలిరావాలని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. ఈనెల 24వ తేదీ జరగనున్న తిరుపతి 894వ పుట్టిన రోజు పండగను నగర ప్రజలంతా కలసి జరుపు కుందాం.. రండి అని ఆహ్వానిస్తూ నగరంలోని గాంధీ రోడ్‌లో భూమన కరుణాకర రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గురువారం ఆహ్వాన పత్రాలను స్థానిక ప్రజలకు అందజేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లల్లో స్వయంగా ఫ్లెక్సీ కట్టి పుర ప్రజలను ఉత్సాహపరిచారు. ఈసందర్భంగా భూమన మాట్లాడుతూ జగద్గురు రామానుజాచార్యులు వారి అమృత హస్తాలతో తిరుపతికి 24.02.1130న నామకరణం చేసి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. తిరుమల అర్చకుల కోసమే ఏర్పాటు చేసిన తిరుపతికి అప్పట్లో గోవిందరాజపురంగా నామకరణ చేశారని చెప్పారు. ఇందుకు చారిత్రక ఆధారాలు ఉన్నాయన్నారు. రెండేళ్లుగా తిరుపతి పుట్టిన రోజు పండగను వైభవోపేతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. తిరుపతివాసులు ఈనెల 24వ తేదీ ఉదయం 8.30 గంటలకు తిరుపతి శ్రీగోవింద రాజస్వామి ఆలయం వద్ద నుంచి నిర్వహించే పవిత్ర శోభా యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, కోటూరు ఆంజినేయులు, దూది కుమారి, తాజీన్ ఉదయ్ వంశీ, గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, రాష్ట్ర రవాణా సంస్థ సభ్యుడు సునీల్‌చక్రవర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు తొండమనాటి వెంకటేష్‌రెడ్డి, దేవదానం, దొరైరాజ్, బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, వెంకటేష్‌రాయల్, మస్తానమ్మ పాల్గొన్నారు.

# సీగొల్లపల్లి సిద్ధార్థ కళాశాలలో మెగా క్యాంపస్ సెలక్షన్స్

- 224 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

తిరుపతి రూరల్: మండలంలోని సీగొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెగా క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో వివిధ జిల్లాల నుంచి వచ్చి 601 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిని హైదరాబాద్, బెంగళూరు, చెన్నైకి చెందిన 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారు. 224 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి తెలిపారు. వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజశేఖర్, కార్యదర్శి ఆనంద రెడ్డి, విజయ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ స్వామినాథ్ పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ కొండారెడ్డి

# వ్యాసాశ్రమంలో అఖండ గురుపూజోత్సవాలు


మలయాళస్వామి పాదుకలకు పూజలు చేస్తున్న భక్తులు

ఏర్పేడు: మండల కేంద్రానికి సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన వ్యాసాశ్రమంలో గురువారం 87వ అఖండ గురుపూజోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు వ్యాసాశ్రమ కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మొదటి రోజు వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు సద్గురు మలయాళస్వామి పాదుకల పూజతో గురుపూజోత్సవాలు ప్రారంభమయ్యాయి. వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి తమ కుటీరం నుంచి కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా మలయాళస్వామి అధిష్టాన మందిరానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అధిష్టాన మందిరంలో ఏర్పాటు చేసిన మలయాళ స్వామి చిత్రపటం వద్ద పాదుకలకు పరిపూర్ణానందగిరి స్వామి విశేష పూజలు చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మలయాళ స్వామి పాదుకలకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

**మరో రెండు రోజులు పూజలు**

అఖండ గురుపూజోత్సవాలలో భాగంగా వ్యాసాశ్రమంలో మరో రెండు రోజుల పాటు పూజలు నిర్వహించనున్నారు. శుక్రవారం స్త్రీల పూజ, శనివారం పురుషుల పూజతో గురుపూజోత్సవాలు ముగుస్తాయని వ్యాసాశ్రమ కోశాధికారి తెలిపారు.

## తెప్పలపై తేజోమూర్తి

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి తెప్పోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి తెప్పలపై తేజోవిలాసంలా విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ఆలయ ఆవరణలో స్నపన తిరుమంజనం చేపట్టారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనాలతో అభిషేకం చేశారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీగోవిందరాజస్వామి తెప్పపై అధిరోహించి పుష్కరిణిలో ఏడు చుట్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. తిరుమల చిన్న జీయర్‌స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునిక్రిష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.


తెప్పపై పుష్కరిణిలో విహరిస్తున్న స్వామివారు

## హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

పాకాల: స్థానిక పాలినేనివారిపల్లెలో గుర్తుతెలియన దుండగులు బుధవారం రాత్రి ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పాకాలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పీ.అహ్మద్ పాలినేనివారిపల్లిలో నివాసముంటున్నారు. అతని కుటుంబ సభ్యులు బంధువుల ఊరికి వెళ్లారు. అతను నైట్ డ్యూటీకి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగులగొట్టి 32 గ్రాముల బంగారు నగలు, రూ.60 వేల నగదును అపహరించుకుని వెళ్లారు. బాధితుడు స్థానిక పోలీసులను ఆశ్రయింగా.. సంఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు.

## నకిలీ కొబ్బరి నూనె విక్రయాలపై దాడులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పలు దుకాణాల్లో నకిలీ కొబ్బరి నూనె విక్రయాలపై బుధవారం రాత్రి వరకు దాడులు విజిలెన్స్ అధికారులు నిర్వహించారు. పట్టణంలోని ఐదు దుకాణాలలో సుమారు 500 ఎంఎల్ ప్యారాషూట్ కొబ్బరి నూనె డబ్బాలు 199 వరకు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. దీంతో వారు గురువారం కేసు నమోదు చేశారు.

# శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

- త్వరితగతిన ఐఐటీ శాశ్వత భవనాల నిర్మాణాలు పూర్తి
- ఐఐటీ స్నాతకోత్సవంలో డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ


స్నాతకోత్సవంలో విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు: ఐఐటీ తిరుపతి విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మేర్లపాక రెవెన్యూలో ఉన్న ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 4, 5వ స్నాతకోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ 355 మంది బీటెక్, 106 మంది ఎంటెక్, ఇద్దరు డ్యూయెల్(బీటెక్, ఎంటెక్), 74 మంది ఎంఎస్సీ, 17 మంది ఎంఎస్సీ, 21 మంది పీహెచ్‌డీ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు, అవార్డులు, మెడల్స్ అందజేసినట్లు వివరించారు. ఐఐటీ నుంచి డిగ్రీ పొందిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. త్వరితగతిన ఐఐటీ శాశ్వత భవనాల నిర్మాణాలు చేపట్టినట్లు వెల్లడించారు. బీటెక్‌కు చెందిన విద్యార్థి సామిత్రో గోల్డ్ మెడల్‌ను సాధించినట్లు తెలిపారు. బీటెక్ విద్యార్థులు ప్రభాత్‌రెడ్డి లంకిరెడ్డి, సాజి మాథ్యూస్ గవర్నర్ బహుమతిని సాధించినట్లు చెప్పారు. జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్ హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డీన్ వెంకయ్య, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

**చాలా ఆనందంగా ఉంది**



ఐఐటీ తిరుపతిలో చదవుకోవడం పూర్వజన్మ సుకృతం. బీటెక్ డిగ్రీ పూర్తిచేశాను. బీటెక్‌లో గోల్డ్ మెడల్‌ను పొందడం చాలా ఆనందంగా ఉంది.

-సామిత్రో, బీటెక్, ఐఐటీ, ఏర్పేడు మండలం

**ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది**



ఐఐటీ తిరుపతిలో ఎంటెక్ డిగ్రీ పూర్తి చేశాను. డిగ్రీ పూర్తయిన వెంటనే ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఎంతో సంతోషంగా ఉంది.

-శ్రీరాం, ఎంటెక్, ఐఐటీ, ఏర్పేడు మండలం

**ఎంటెక్ పట్టా సాధించా**



ఐఐటీలో ఎంటెక్ పట్టా సాధించడం ఎంతో కష్టం. రాత్రింబవళ్లు చదువుపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది. ఎంటెక్ పట్టా సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది.

-గ్లోరీస్ సింగ్, ఎంటెక్, ఐఐటీ, ఏర్పేడు మండలం

# వైఎస్సార్‌సీపీతోనే సుస్థిరాభివృద్ధి


పేరూరులో మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త మోహిత్‌రెడ్డి
- పండగలా ఆసరా సంబరాలు

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో సంక్షేమం, సుస్థిరాభివృద్ధి సాధ్యమని, ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం, చెర్లోపల్లి, పుదిపట్ల, పేరూరు, లింగేశ్వరనగర్, పాడిపేట, రామానుజపల్లి పంచాయతీల్లో గురువారం 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తుడా చైర్మన్ ద్వారా సంఘాలకు ఆసరా చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెర్లోపల్లిలో 50 సంఘాలకు రూ.2.28 కోట్లు, పుదిపట్లలో 55 సంఘాలకు రూ.3.23 కోట్లు, పేరూరులో 129 సంఘాలకు రూ.7.10 కోట్లు, పాడిపేటలో 28 సంఘాలకు రూ.1.13 కోట్లు, రామానుజపల్లిలో 13 సంఘాలకు రూ.59.55 లక్షలకు సంబంధించిన చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో అర్హుల ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం జగన్‌కు పెరిగిన ప్రజాధారణను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు కుయుక్తులు పన్నుతున్నారని, అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్న రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు.

**పూల వర్షం కురిపిస్తూ...**

ఆసరా వేడుకలకు విచ్చేసిన తుడా చైర్మన్‌కు ఆయా పంచాయతీల మహిళలు, స్థానికులు పూలవర్షం కురిపిస్తూ అపూర్వ స్వాగతం పలికారు. అడగకుండానే అకౌంట్లలో నిధులు జమచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ తరుపున కృతజ్ఞతలు తెలపాలంటూ...థ్యాంక్యూ సీఎం సర్... నినాదాలు మిన్నంటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నమ్మ, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విప్పర్ల వాసుదేవనాయుడు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

## బైక్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైమ్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగలు ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నివాసముంటున్న కాకాశి సాత్విక్ అలియాస్ గోకుల్, షేక్ అబ్దుల్ కరీం, ఎర్ర బాలాజీ, జస్వంత్, ధనశేఖర్ ముఠాలుగా ఏర్పడి గత కొన్ని నెలలుగా తిరుపతి నగరంతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బైక్ దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో క్రైమ్ డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, అతని బృందం గురువారం మధ్యాహ్నం తిరుపతి అలిపిరి బైపాస్ రోడ్‌లోని టాటా క్యాన్సర్ హాస్పిటల్ వద్ద దొంగలను గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.12.5 లక్షల విలువ చేసే 16 మోటర్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాకాశి సాత్విక్ పాత నేరస్తుడుకాగా అతనిపై డికాయిటీ, రాబరీ రాత్రి వేళల్లో ఇంటి దొంగతనాలకు పాల్పడడం తదితర కేసులు ఉన్నాయి. మిగతా వారందరూ కూడా నేరచరిత్ర కలిగిన వారిని పోలీసులు పేర్కొన్నారు.